క్లుప్తంగా

కృష్ణమూర్తి కుటుంబానికి సీపీఎం సాయం



కృష్ణమూర్తి భార్యకు రూ.2.15 లక్షల చెక్కు అందిస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: స్థానిక సీపీఎం సీనియర్ నాయకుడు వి.కృష్ణమూర్తి నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన చేసిన సేవలను గుర్తించిన విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పార్టీ నాయకులు కృష్ణమూర్తి కుటుంబానికి అండగా నిలిచారు. వారంతా సేకరించిన రూ 2.15 లక్షలను చెక్కు రూపంలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల సీపీఎం కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, కె.లోకనాథం శుక్రవారం ఆరిలోవలో ఉన్న కృష్ణమూర్తి భార్య అన్నపూర్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, నరేంద్రకుమార్, రంగమ్మ, శంకరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ నిర్మాణ పనుల పరిశీలన

ఆరిలోవ: బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని హనుమంతవాక వద్ద జరుగుతున్న ఆరిలోవ పోలీస్ స్టేషన్ నిర్మాణాన్ని శుక్రవారం డీసీపీ కె.శ్రీనివాసరావు, ఆరిలోవ సీఐ సోమశేఖర్‌తో కలసి పరిశీలించారు. ఎంత వరకు పనులు జరిగాయి, జరగాల్సిన పనులు, ఎంత ఖర్చు చేశారు, చేయాల్సిన ఖర్చు తదితర వాటి గురించి డీసీపీ ఆరా తీశారు. నిర్మాణం త్వరగా పూరి చేసి, భవనం వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు. ఈ సందర్శనలో ఎస్ఐ సూర్యనారాయణ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రాజగణపతి అలంకరణలో..



రాజగణపతి అలంకరణలో సంపత్ వినాయగర్

సీతమ్మధార: ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయంలో రాజగణపతి అలంకరణలో సంపత్ వినాయగర్ భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. గణపతి హోమం, నాదస్వర కచేరి, సర్వదర్శనం అనంతరం నారాయణ సేవ నిర్వహించినట్టు ప్రధాన అర్చకులు మోహన్‌స్వామి తెలిపారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

మహారాణిపేట : జర్నలిస్టుల క్రీడలు అభినందనీయమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తి ప్రదర్శించి అందరి మన్ననలు పొందాలని సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అన్నారు. విశాఖ వెట్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మొదలైన క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు.

మానసిక ఆస్పత్రికి అదనపు హంగులు

- రూ.30 కోట్లతో పలు భవనాల నిర్మాణం పూర్తి



ఆస్పత్రి సూపరింటెండెంట్ రామిరెడ్డికి భవనాలు అప్పగిస్తున్న ఏఈ నాయుడు



నూతనంగా నిర్మించిన భవనాలు

ఏయూక్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో అధునాతన భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా రూ.30 కోట్ల వ్యయంతో 20 పడకల చిన్న పిల్లల మానసిక వైద్య విభాగం, 20 పడకల వృద్ధుల మానసిక వైద్య విభాగం, 40 పడకల డి అడిక్షన్ విభాగం, సరికొత్తగా పునరావాస కేంద్రం, పీజీ విద్యార్థుల హాస్టల్, అధునాతన సమావేశ మందిరాలతో కూడిన అకడమిక్ బ్లాక్‌ను ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక వసతుల కల్పనా సంస్థ(ఏపీఎంఎస్ఐడీసీ) నిర్మించింది. ఈ భవనాలను అధికారికంగా శుక్రవారం సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.నాయుడు ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డికి అప్పగించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ కొత్తగా సమకూరిన మౌలిక వసతులతో ఆస్పత్రి సేవలు మరింత విస్తృతం అవుతాయన్నారు. త్వరలోనే ఫర్నిచర్ ఏర్పాటు చేసి.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ భవనాలను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఆస్పత్రి అభివృద్ధికి నిధులు అందించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు

మహారాణిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం సచివాలయ ప్రాంగణంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఎండాడలో యాదవ సామాజిక భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించిన ముఖ్యమంత్రికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పదేళ్ల కిందట ఇచ్చిన హామీని మర్చిపోకుండా నెరవేర్చిన వైఎస్ జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం వైఎస్ జగన్‌నుతో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

భక్తులకు మెరుగైన సేవలందించాలి

- అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవు
- సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దేవస్థానం అధికారులను ఆదేశించారు. సింహగిరిపై శుక్రవారం ఆయన దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం, ఆలయ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా భక్తులకు మంచినీరు విరివిగా అందించే చర్యలుతీసుకోవాలని, పారిశుధ్యం మెరుగుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. అన్నప్రసాదం విభాగాన్ని పరిశీలించారు.



అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహగిరికి వచ్చే ఏ ఒక్క భక్తుడు ఇబ్బందికి గురికాకుండా చూడాలని, అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఈఈ రాంబాబు, డీఈ నాగేశ్వరరావు, ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు,ఏఈ హరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, పీఆర్వో నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు పరిధిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ విమ్స్‌కు సంబంధించిన కైలాసగిరి 11 కేవీ ఫీడర్ నిర్వహణలో భాగంగా ఏపీ ఈపీడీసీఎల్ అధికారులు శనివారం రోడ్ల పక్కన చెట్ల కొమ్మలు తొలగించనున్నారు. దీంతో పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. విశాలాక్షినగర్, కైలాసగిరి రోడ్డు, రెవెన్యూ కాలనీ, హనుమంతవాక కొండవాలు, బీఎస్ఆర్ నగర్, తోటగరువు ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముగిసిన పాఠశాల క్రీడా పోటీలు



ఖోఖో ఆడుతున్న బాలికలు



కబడ్డీ ఆడుతున్న బాలికలు



యోగాసనాల పోటీలలో బాలికలు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల విద్యార్థుల కోసం నిర్వహించిన క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలు గురువారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన విషయం తెలిసిందే. ముందుగా ప్రకటించిన ప్రణాళిక ప్రకారం మూడు రోజుల పాటు జరగాల్సిన ఈ పోటీలు రెండు రోజుల్లోనే ముగించారు. అండర్ 14, 17 సంవత్సరాల వయసుగల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. మొదటి రోజు బాలురు, రెండో రోజు బాలికలకు జరిగాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేశారు. రెండో రోజు నియోజకవర్గంలో 12 పాఠశాలలు నుంచి 100 మంది బాలికలు పోటీలకు హాజరయ్యారు. కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా తదితర పోటీలు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, ఎ.చంద్రబాబునాయుడు పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఖోఖోలో ప్రతిభ కనబరిచిన తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి నలుగురు, నక్కవానిపాలెం శారదా పాఠశాల నుంచి ముగ్గురు, ఆదర్శనగర్ శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్ నుంచి ముగ్గురు, ఆరిలోవ సెయింట్ ఆన్స్ పాఠశాల నుంచి ముగ్గురు బాలికలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో టింపనీ స్కూల్, శ్రీసత్యసాయి విద్యా విహార్, తోటగరువు హైస్కూల్, శారదా స్కూల్ నుంచి ఒక్కొక్కరు చొప్పున ఎంపికయ్యారు. కబడ్డీలో తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి నలుగురు, శారదా స్కూల్ నుంచి ముగ్గురు, సెవెంత్ డే నుంచి ఇద్దరు బాలికలు ఎంపికయ్యారు. వీరంతా జిల్లా స్థాయిలో జరగనున్న పాఠశాల క్రీడా పోటీలకు అర్హత సాధించినట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు తెలిపారు.

ప్రాచీన సాహిత్యమే సినిమాలకు ముడిసరకు

ఏయూ క్యాంపస్: ప్రాచీన సాహిత్యమే తెలుగు సినిమాలకు ముడిసరకు అని ద్రావిడ విశ్వవిద్యాలయ ప్రచురణ విభాగ డైరెక్టర్ ఆచార్య డి.వి.శ్రావణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఏయూ తెలుగు విభాగంలో ×తెలుగు సాహిత్యం–జీవన నైపుణ్య విలువలు×అంశంపై ఆయన అతిథి ఉపన్యాసం చేశారు. విస్తారమైన తెలుగు సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేస్తే నైపుణ్యాలతో పాటు వ్యక్తిత్వ వికాసాలు అలవడతాయన్నారు. ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను అర్థం చేసుకుంటే భాషా పరిణామంతో పాటు భావ సౌందర్యం అర్థమవుతుందన్నారు. తెలుగు చదివే విద్యార్థులు ముందు సాహిత్య మర్మాన్ని గ్రహించినప్పుడే జీవన నైపుణ్య విలువలు తెలుస్తాయన్నారు. కవుల రచనలో ఉన్న దృక్పథం, భావనలు అర్థం చేసుకోగలిగితే జ్ఞాన సముపార్జనతో పాటు మనో వికాసం వర్ధిల్లుతుందన్నారు. కార్యక్రమానికి తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఆచార్యులు సీతారత్నం, ఈశ్వరమ్మ, బూసి వెంకటస్వామి, కె.రత్నశేఖర్, పి.లావణ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఆచార్య డి.వి.శ్రావణ్‌కుమార్

విద్యా సమాచారమ్

ఉత్తమ ఆచార్యులకు అభినందన



ఆచార్యులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, తదితరులు

ఏయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఆచార్య పురస్కారాలు అందుకున్న ఆచార్యులను ఏయూ వీసీ పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శుక్రవారం అభినందించారు. ఈ మేరకు వీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆచార్య ఎస్.కిషోర్ బాబు, ఆచార్య పి.శ్యామల, ఆచార్య సి.వి.నాయుడు, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య కె.రమాసుధ, ఆచార్య డి.లలిత భాస్కరిలను సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

చిల్లర వర్తకుల చట్టం అమలుకు డిమాండ్

ఎంవీపీ కాలనీ: చిల్లర వర్తకుల చట్టాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలని విశాఖపట్నం తోపుడు బళ్ల కార్మిక సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. సంఘం ప్రతినిధులు, సభ్యులు శుక్రవారం ఉషోదయ కూడలిలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తోపుడు బళ్లు, ఫుట్‌పాత్ వెంబడి షాపులు తొలగిస్తామని జీవీఎంసీ సిబ్బంది ఒత్తిడి కారణంగా ఆందోళనకు గురై మరణించిన ఆత్మకూర జగన్నాథంకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ పనుల పేరుతో చిల్లర వర్తకులను జీవీఎంసీ ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఉషోదయ కూడలిలో ఫుట్‌పాత్‌ల నిర్మాణం, రోడ్ల విస్తరణ పేరిట దశాబ్దాలుగా ఉన్న షాపులను తొలగిస్తే చిల్లర వ్యాపారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. ఈ నేపథ్యంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వెంకటరావు, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తోపుడుబళ్ల కార్మిక సంఘం ప్రతినిధులు

సహకార సంఘం కార్యదర్శిగా ఖాదర్ బాబా

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగుల సహకార సంఘం కార్యదర్శిగా షేక్ ఖాదర్‌బాబా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బాబాను అధ్యక్షుడు ఆచార్య వి.సిద్ధయ్య, ఉపాధ్యక్షుడు సిహెచ్.లక్ష్మణబాబు, సంయుక్త కార్యదర్శి కొయ్య సోమేష్, కోశాధికారి డాక్టర్ ఎస్.ఎం.యుగంధర్, డైరెక్టర్లు కె.కిరణ్, దువ్వి గోవింద్, వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.హెచ్.ఫరూకీ, ఏపీఐఐసీ డైరెక్టర్ మెల్లి అప్పారావు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ అడ్వైజర్ పి.దుర్గారావు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ డైరెక్టర్ పేర్ల విజయచందర్, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ జోషిల, వర్సిటీ ఉద్యోగులు పెద్ద సంఖ్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాబా మాట్లాడుతూ సంస్థ నియమావళిని అనుసరిస్తూ, తన విధులను పూర్తి స్థాయిలో నిర్వహిస్తానన్నారు. తనకు అవకాశం కల్పించిన ఏయూ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. సహకార సంఘం అధ్యక్షుడిగా ఆచార్య వి.సిద్ధయ్య, కోశాధికారిగా ఆచార్య ఎస్.ఎం.యుంగంధర్‌లు కూడా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.



ఖాదర్‌బాబాను సత్కరిస్తున్న ఫరూకీ

అన్నసమారాధనలు.. కుంకుమ పూజలు



సింహగిరి కాలనీలో అన్నం వడ్డిస్తున్న మేయర్ హరివెంకటకుమారి



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న పీతల గోవింద్



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



అన్నదానం కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పు సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు



చైతన్యనగర్‌లో ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అన్నసమారాధనలతో ఆయా ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. జీవీఎంసీ 9వ వార్డు పెదగదిలి సమీప సింహగిరి కాలనీలో ఫ్రెండ్స్ అండ్ యంగ్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని ముందుగా స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె భక్తులకు భోజనాలు వడ్డించారు. సింహగిరి కాలనీ, సంజయ్‌గాంధీ కాలనీ, పెదగదిలి తదితర కొండవాలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో స్థానికులు ఈ అన్నసమారాధనలో పాల్గొని స్వామి ప్రసాదం స్వీకంచారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, మోహనరెడ్డి, అసోసియేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు సీరం ఈశ్వరరావు, రామ్‌సూరి, మువ్వల శ్రీను, అనుగుపల్లి ఈశ్వరరావు, అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ

ఎండాడ రాజీవ్‌నగర్‌లో వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం రాత్రి రాజీవ్‌నగర్ యూత్ స్టార్స్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మద్దిలపాలెం : వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జీవీఎంసీ 22వ వార్డులో పిఠాపురం కాలనీలో ఎన్వై బాయ్స్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు ప్రారంభించారు. అలాగే చైతన్యనగర్‌లో చాలెంజర్స్ వారియర్స్ ఆధ్వర్యంలో కొండారెడ్డి సహకారంతో మహా అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు సాడి కేశవరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సూర్యనారాయణరెడ్డి, మహిళా ప్రతినిధులు బందరు లక్ష్మి, చిన కొండమ్మ, పెద కొండమ్మ, చిట్టెమ్మ, చైతన్య నగర్ కాలనీ యువకులు పాల్గొన్నారు.

టీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు కళాభారతి ప్రాంతంలో ఎన్వై బాయ్స్ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ప్రారంభించారు. అన్న సంతర్పణకు వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ 10 బియ్యం బస్తాలు అందజేశారు.

– రేసపువానిపాలెం శివానందపురం బాయ్స్ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ నిర్వహించారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఐదు బియ్యం బస్తాలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

‘లిప్’ తో విద్యార్థులకు ఉజ్వల భవిత

మద్దిలపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్డు ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్‌తో పాటు యూనిసెఫ్ వారి లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రొగ్రాం(లిప్) విద్యార్థులు ఉజ్వల భవిత్‌కు ఎంతో దోహదపడుతుందని ఏయూ బీసీడీఈ ప్రొగ్రాం కో–ఆర్డినేటర్ ఆచార్య ఎస్.ఎ.డి.పాల్ అన్నారు. మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యతో పాటు సామాజిక బాధ్యత ఎంతో అవసరమన్నారు. యూనిసెఫ్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఏర్పాటు చేసిన లెర్నింగ్ ఇంప్రూమ్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రథమ సంవత్సరం విద్యార్థులు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ బదులుగా నిర్వహించవచ్చునని తెలిపారు.



మాట్లాడుతున్నఆచార్యులు ఎస్.ఎ.డి.పాల్

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ 16వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని వర్సిటీలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో లయన్స్ బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని వర్సిటీ ఉపకులపతి ఆచార్య డాక్టర్ శ్రీసుధ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం చేసి.. ప్రాణదాతలుగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. ఈ శిబిరంలో 100 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ జోగినాయుడు, సమన్వయకర్త డాక్టర్ విశ్వచంద్ర, నిర్మలాదేవి, పీడీ ఓఎం రాజు, లయన్స్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి సుధాకర్, డాక్టర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు. చిత్రంలో ఉపకులపతి ఆచార్య శ్రీసుధ తదితరులు

వైఎస్సార్ బీమా పరిహారం అందజేత

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు జాలరిపేటకు చెందిన చింతపల్లి చిన్న అనే వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు బంగారి పృధ్వీరాజ్ స్థానిక సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. సకాలంలో స్పందించిన సచివాలయ సిబ్బంది మృతుడి కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం లభించేలా చర్యలు చేపట్టారు. వైఎస్సార్ బీమాలో భాగంగా రూ.10 వేల తక్షణ సాయాన్ని అందించడంతో పాటు రూ.90 వేలు బ్యాంకు ఖాతాలో వేశారు. రూ.10 వేలను శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు.



లబ్ధిదారులకు పరిహారం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

పొంచి ఉన్న ప్రమాదం

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో దీన్‌దయాల్ పురం వద్ద హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఎదురుగా బస్ షెల్టర్ పైనుంచి రేకులు కిందకు జారిపోయాయి. ఇక్కడ ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన ఈ షెల్టర్ రేకులు ఊడిపోయి కిందకు వేలాడుతున్నాయి. ఈ షెల్టర్ లోపలికి వెళ్లే సమయంలో రేకులు ప్రయాణికుల తలకు తగులుతున్నాయి. ఫుట్‌పాత్‌పై ప్రతి రోజు నడక కోసం వెళ్తున్నవారు కూడా ఇబ్బందిపడుతున్నారు. నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి ఉంది. హనుమంతవాక వైపు వెళ్లే ప్రయాణికులు బస్ కోసం ఇక్కడే నిరీక్షిస్తుంటారు. రేకులు ఎప్పుడు జారిపడిపోతాయోమోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఊడిపోయిన రేకులను తొలగించి కొత్తవి అమర్చాలని వారు కోరుతున్నారు.



దీన్‌దయాల్‌పురం వద్ద జారుతున్న బస్ షెల్టర్ రేకులు